ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
ఆదివారం 11 ఆగస్టు 2024



Sunday SPECIAL

సజీవ శిల్పం

కాకతీయుల నాటి కళాసంపదకు పునరుజ్జీవం

'శిలలపై శిల్పాలు చెక్కినారు.. మనవారు సృష్టికే అందాలు తెచ్చినారు..' అని ఓ సినీ గేయ రచయిత అలనాటి తెలుగువారి శిల్ప కళా వైభవాన్ని చాటి చెప్పారు. మొక్కవోని దీక్షతో శిలను శిల్పంగా మలిచి.. ప్రపంచానికి అందించేందుకు శిల్పులు చేసిన కృషికి యునెస్కో గుర్తింపు పొందిన మన రామప్ప శిల్ప సౌందర్యమే నిదర్శనం. అంతేకాదు అనేక చరిత్రాత్మక కట్టడాలను నిర్మించిన కాకతీయుల కాలంలో శిల్పం నాట్యమాడగా.. శిల నుంచి స్వరాగాలు పలికాయట. అలాంటి అద్భుత శిలా సంపద, కళాఖండాలపై కాలక్రమంలో ప్రకృతితో పాటు దుండగులు జరిపిన దాడులతో చాలా చోట్ల ధ్వంసమైంది. రాష్ట్రంలోని ముఖ్యంగా ఓరుగల్లులోని పురాతన దేవాలయాలు, ప్రదేశాలను సందర్శిస్తే.. కొన్ని శిల్పాలు దెబ్బతిన్నట్టు.. లేదంటే వాటి అసలు ఆకృతిని కోల్పోయినట్టు అర్థమవుతుంది. అలాంటి శిల్పాల పాత రూపం చెక్కుచెదరకుండా అసలు అకృతిని ఇచ్చేందుకు చరిత్ర పరిశోధకులు శిల్పాల పునరుజ్జీవానికి శ్రీకారం చుట్టారు. చారిత్రక సంపదను యథాతథంగా ఆవిష్కరింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



- దెబ్బతిన్న శిల్పాల ఆకృతితో సిమెంట్ విగ్రహాల తయారీ
- వారసత్వ కట్టడాల్లో 4వేలకుపైగా కళాఖండాలు.. వీటిలో 100 శిల్పాలకు జీవం
- రామప్ప, వరంగల్ కోట తదితర ప్రాంతాల నుంచి సేకరణ
- చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో అడుగులు
- కాకతీయుల శిల్ప సౌందర్యాన్ని కాపాడే ప్రయత్నంలో చరిత్ర పరిశోధకులు
- జగదల్పూర్ రాజ్‌మహల్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు ప్రయత్నాలు


7





పల్లెపోరుకు సమాయత్తం

- 'పంచాయతీ' ఎలక్షన్లకు అధికార యంత్రాంగం కసరత్తు



- ఓటరు జాబితా తయారీకి సన్నాహాలు
- ఎంపీడీవో, ఎంపీవో, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ
- జిల్లాలో 461కి తోడు మరో 26 వెరసి 487 జీపీలు

మహబూబాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : శాసన సభ, లోక్‌సభ ఎన్నికల పూర్తితో 'పల్లెపోరు' గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. జీపీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కొద్దిరోజుల కిందట ఇచ్చిన ఆదేశాలతో మహబూబాబాద్ జిల్లాలో ఎన్నికల వేడి రాజుకుంటోంది. ప్రధానంగా ఎన్నికలకు సంబంధించి వార్డుల విభజనతో పాటు కొత్తగా ఏర్పడుతున్న గ్రామపంచాయతీలపై అధికారులు దృష్టికేంద్రీకరించారు.

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా పూర్వంలో 16 మండలాలు ఉండగా వాటిని 18 మండలాలుగా విభజించిన నేపథ్యంలో మొత్తం 461 గ్రామపంచాయతీలు, 4,030 వార్డులకు తోడు కొత్తగా జిల్లాలో మరో 26 గ్రామపంచాయతీలు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గెజిట్ కూడా వచ్చేసినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. పాత పంచాయతీలు 461కితోడు పెరిగిన 26 జీపీలకు కలిపి మొత్తం గ్రామ పంచాయతీల సంఖ్య 487 కు పెరుగుతోంది. వార్డులు ఎన్ని పెరిగేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. తాజాగా అన్నిజిల్లాల్లోని గ్రామపంచాయతీలకు సంబంధించి వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయడానికి ఇటీవలనే అన్ని జిల్లాల ప్రాజెక్టుమేనేజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు హైదరాబాద్‌లో శిక్షణ పూర్తి చేశారు. అక్కడ శిక్షణ పొంది వచ్చిన మాస్టర్ ట్రైనర్‌లు మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని మండల పరిషత్ అధికారులు (ఎంపీడీవో)లు, మండల విస్తరణ అధికారులు (ఎంపీవో)లతో పాటు డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు.

పార్లమెంట్ జాబితాకనుగుణంగా..

తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితాను అనుసరించి వార్డుల విభజన చేపట్టాలని అధికార యంత్రాంగం కసరత్తులు చేస్తోంది. ఇందుకు సంబంధించి పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితాను పరిశీలించి నియోజకవర్గం, మండలాలు, గ్రామాల వారీగా ఓటరు జాబితాలో వార్డుల వారీగా విభజన చేసేందుకు సన్నాహాలు చేపట్టారు. వార్డుల విభజనకు సంబంధించి హైదరాబాద్ మాస్టర్ ట్రైనర్లకు శిక్షణఇచ్చిన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో యావత్ కుటుంబం ఒకే వార్డు పరిధిలోకి వచ్చేలా విభజన చేపడుతున్నట్లు సమాచారం. పూర్వంలో ఒకేకుటుంబానికి చెందిన వారు వివిధ వార్డుల్లో ఓట్లు కలిగి ఉండి గందరగోళంగా ఉండడంతో ఈసారి ఆ పరిస్థితి లేకుండా చూసేందుకు అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. దీనికై ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను కూడ వాడుతున్నట్లు తెలుస్తోంది. సదరు సాఫ్ట్‌వేర్ ద్వారానే వార్డుల విభజన చేపడుతారని సమాచారం. ఎప్పటిలాగే పంచాయతీ ఎన్నికలు జిల్లా వ్యాప్తంగా ఒకేసారి జరుగకుండా మూడువిడతల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒకేసారి ఎన్నికల నిర్వహణకు అధికారులు, సిబ్బంది సరిపోయే పరిస్థితి లేకపోవడంతో మూడువిడతలుగా ఎన్నికల నిర్వహణ చేస్తూ రావడం ఆనవాయితీ. ఈసారి కూడా ఇదే తరహాలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మొత్తంగా వార్డుల వారీగా ఎన్నికల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల నిర్వహణ జరిగేందుకు వార్డుకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటుచేసేందుకు అధికారులకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఓటర్ల ప్రాతిపదికన ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించనున్నట్లు చెబుతున్నారు. ఎక్కువ ఓట్లు ఉన్న గ్రామాలకు సంబంధించి పోలింగ్ అధికారులు, సిబ్బందిని పెంచాలని భావిస్తున్నారు.

గత పంచాయతీ ఎన్నికల్లో ఇలా..

మహబూబాబాద్ జిల్లాలో 2018లో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల కేటాయింపు చేశారు. 2019 తొలి నాళ్లలో మూడువిడతలుగా ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 461 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో షెడ్యూల్ ఏరియాలోని 102 గ్రామపంచాయతీలను అప్పట్లో షెడ్యూల్ ట్రైబ్స్ (ఎస్టీ)లకే రిజర్వు చేశారు. వీటికి తోడు వందశాతం షెడ్యూల్ ట్రైబ్స్ జనాభా ఉన్న మరో 115 పంచాయతీలు కూడా ఎస్టీలకే రిజర్వు అయ్యాయి. ఇక మిగిలిన నాన్‌షెడ్యూల్డ్‌లో ఉన్న 244 గ్రామపంచాయతీలలో జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు తీయడంతో మరో 58 పంచాయతీలు ఎస్టీలకే లభించాయి. వెరసి 275 గ్రామపంచాయతీల సర్పంచ్ పదవులు ఎస్టీలకే దక్కాయి.



కలెక్టరేట్‌లో శిక్షణకు హాజరైన ఎంపీడీవోలు, ఎంపీవోలు, అధికారులు

ఇక ఎస్సీలకు 42, బీసీలకు 22 రిజర్వేషన్లు రాగా, మిగిలిన 122 పంచాయతీలను జనరల్ కేటగిరి కింద వదిలేశారు. మొత్తం సర్పంచ్ పదవుల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించారు. ఈ ప్రకారంగా మళ్లీ ఎన్నికలు జరిగితే అత్యధిక పంచాయతీలు ఎస్టీలకే ఉంటాయనడం అతిశయోక్తి కాదు. రానున్న పంచాయతీ ఎన్నికలకు ముందే జిల్లాలో గత ప్రభుత్వం ప్రతిపాదించిన 26 నూతన గిరిజన గ్రామపంచాయతీలు ఏర్పాటుకు ప్రస్తుత సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు గెజిట్ కూడా విడుదలైంది.

18 మండలాల్లో పూర్వ 461 గ్రామపంచాయతీలకు అదనంగా 26 గిరిజన గ్రామపంచాయతీలు ఏర్పడుతున్న క్రమంలో జిల్లా వ్యాప్తంగా గిరిజన రిజర్వుడ్ పంచాయతీలు పెద్దసంఖ్యకు చేరుకుంటున్నాయి. మండలాల వారీగా కురవిలో 07, పెద్దవంగరలో06, మరిపెడలో 04, గూడూరులో 02, తొర్రూరులో 02, ఇక దంతాలపల్లి, నర్సింహులపేట, చిన్నగూడూరు, కేసముద్రం, ఇనుగుర్తి మండలాల్లో ఒక్కొక్క పంచాయతీ చొప్పున ఏర్పాటు అవుతున్నాయి. ఆయా పంచాయతీల్లో వార్డుల విభజన ద్వార ఏ పంచాయతీకి ఎన్ని వార్డులు వస్తాయనేది తేలాల్సి ఉంది.



కొత్తగూడలో తోపుడుబండ్లు పంపిణీ చేస్తున్న సుధీర్‌రాంనాథ్ కేకన్

పోలీస్‌శాఖ ప్రజలకు అండగా ఉంటుంది

- గుడుంబా, గంజాయి బారినపడి జీవితాలను కోల్పోవద్దు
- ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్
- పోలీసుల ఆధ్వర్యంలో కొత్తగూడలో 'చేయూత' కార్యక్రమం
- బాధిత మహిళలకు కుట్టుమిషన్లు, తోపుడు బండ్లు అందచేత

కొత్తగూడ, ఆగస్టు 10 : పోలీస్‌శాఖ జిల్లా ప్రజలకు అన్నివిధాలుగా అండగా ఉంటుందని, గుడుంబా, గంజాయి బారినపడి జీవితాలను కోల్పోవద్దని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సూచించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడలో 'చేయూత' కార్యక్రమం నిర్వహించారు. గుడుంబాకు బానిసై భర్తను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బాధిత మహిళలకు ఉపాధి కల్పించేందుకు కుట్టుమిషన్లు, తోపుడుబండ్లను ఆయన అందజేశారు. అలాగే మహిళలందరికి చీరలు పంపిణీ చేశారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. గుడుంబా, గుట్కా, గంజాయితో ప్రజలకు కలిగే నష్టాలను ప్రొజెక్టర్ ద్వారా చూపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గుడుంబాను నిర్మూలించేందుకు తరచుగా దాడులు చేస్తున్నామన్నారు. పోలీస్ కళాబృందాలతో పల్లెల్లో గుడుంబాతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యువత గంజాయి మత్తులోపడి చెడుమార్గాలలో నడవకుడదని సూచించారు. గుడుంబా వలన నష్టపోయిన బాధితులు మిగతా మహిళలకు అవగాహన కల్పిం చాలన్నారు. మారుమూల గ్రామాలలో ప్రజలు కనీస వైద్యం తెలియని ఆర్ఎంపీల వద్ద వైద్యం చేసుకుని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. మూఢనమ్మకాలను నమ్మి మోసపోవద్దని ఎస్పీ అన్నారు.

మహబూబాబాద్‌ను గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ కంకణం కట్టుకున్నారని డీఎస్పీ తిరుపతిరావు

మిగతా 8వ పేజీలో..



నేటి నుంచి బోనాల పండుగ షురూ

బుధ, ఆదివారాల్లో మొక్కులు చెల్లించనున్న భక్తులు

జిల్లాలో ముస్తాబైన ముత్యాలమ్మతల్లి ఆలయాలు

అమ్మ బైలెల్లినాదో.. తల్లి బైలెల్లినాదో..

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 10 : జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుంచి బోనాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ముత్యాలమ్మ తల్లికి బోనాలను సమర్పించేందుకు ఆలయాలను సుందరీ కరించారు. ఏటా శ్రావణమాసంలో ఊరూరా కుల, మతాలకు అతీతంగా పిల్లాపాపలతో గ్రామీణ దేవతలకు బోనాలతో మొక్కులు చెల్లించుకుని, ప్రత్యేక పూజలు చేస్తారు. అందులో భాగంగానే ఆలయ పూజారులు, కమిటీల నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అమ్మవారి ఆలయం ఎదుట వినిపించే బోనాల పాటలు, జానపద క్రీడ కథలు, పిల్లలను ఆకర్షించే ఆటవస్తువస్తువుల షాపులను ఏర్పాటు చేశారు. వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని కోరుతూ బోనాలను అమ్మ వారికి నైవేద్యంగా పెడతారు. తరతరాలుగా ఈ పండుగ ఆచారం కొనసాగుతోంది. పోలేరమ్మ, పోచమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ, నాంచారమ్మ, ఉప్పలమ్మ, కోట మైసమ్మ, పెద్దమ్మతల్లి, ఎల్లమ్మతల్లి ఇలా రకరకాల పేర్లతో వెలిసిన గ్రామదేవతలను ఈ పర్వదినాన పూజి స్తారు. భక్తులు కుమ్మరి ఇంటి నుంచి కొత్తకుండను తెచ్చి, కుండ అడుగు భాగం, పైభాగంలో సున్నంరాసి, నడుమ నూనె రాసి, పసుపు కుంకుమలతో బొట్లుపెట్టి బోనాన్ని అందంగా ఆలంకరించుకుంటారు. కుండచుట్టూ వేపాకు లు కడతారు. బోనం కుండలో వండిన పసుపు అన్నం, కుండ పై చెంబులాంటి చిన్న మట్టిపాత్రను పెట్టి చింతపం డు నీళ్ళు, ఉల్లిపాయలు లేక బెల్లం పానకం పోస్తారు. దాని పైనే కంచుడు పెట్టి అందులో దీపం పెడతారు. అమ్మ వారికి నైవేద్యం పెట్టే వరకు దీపం ఆరకుండా చూసుకుంటారు. మట్టి లేక రాగి పాత్రలో ఈ నైవేద్యాన్ని వండుతారు. ముగ్గులతో అలంకరించిన ప్రదేశంలో బోనాన్ని పెడతారు. అమ్మవారికి బోనం సమర్పిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

బోనం అంటే..

పర్వదినం తెల్లవారుజామున అమ్మవారికి బోనం తయారు చేస్తారు. పసుపు కలిపిన అన్నంతో అమ్మవారికి బోనం తయారు చేస్తారు. బోనంపైన దీపం పెట్టుకుని వేపాకు, కుంకుమ, పసుపుతో కుండను అలంకరించి మరో చేతిలో అమ్మవారికి సాకపోయడానికి నీరు తీసుకుని మహిళలు దేవాలయానికి వస్తారు. అమ్మవారి ముందుగా ఆలయంలో సానపోసి బోనంలోని పసుపు అన్నం సమర్పించి, దర్శనం చేసుకుంటారు.

ఘట్టం..

అమ్మవారి ఆకారంలో అలంకరించిన రాగి కలశాన్ని ఘట్టం అంటారు. పూజారి ఒంటికి పసుపు రాసుకుని ఈ ఘట్టాన్ని మోస్తారు. పండుగ మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు ఈ ఘట్టాన్ని భక్తుల మేళవాయిద్యాల నడుమ ఊరేగిస్తారు. బోనాన్ని నెత్తిన పెట్టుకుని నృత్యాలు చేస్తూ అమ్మవార్లకు బోనాలు చెల్లించి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

వేడుకలకు ముస్తాబైన ఆలయాలు..

మహబూబాబాద్ కొత్తబజారు, పాత బజారులోని ముత్యాలమ్మ తల్లి ఆలయాలను బోనాల వేడుకలను పురస్కరించుకుని ఆలయాలకు రంగులు వేశారు. బోనాల సందర్భంగా ఆలయాలను రంగురంగుల విద్యుత్

మిగతా 8వ పేజీలో..

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు, ఆగస్టు 10 : స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం తొర్రూరులో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. పార్టీ పేదప్రజలకు అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం ప్రజాసేవలోనే ఉంటానన్నారు. కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా కాపాడుకుంటానని, వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలన్నారు. తాను పార్టీ మారడంలేదని స్పష్టం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి కోసం మంజూరైన పనులను అధికారులతో మాట్లాడి చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేస్తానని తెలిపారు. ఈనెల 30వ తేదీన తొర్రూరులో నిర్వహించే గద్దర్ అవార్డుల భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని కోరుతూ కళాకారులు గిద్దె రాంనర్సయ్యతో గోడ పత్రికను ఆవిష్కరించారు. గ్రామాల వారీగా రివ్యూ నిర్వహించి తగు సూచనలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు సీతారాములు, మంగళపెల్లి శ్రీనివాస్, తూర్పాటి అంజయ్య, ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్, రాయిశెట్టి వెంకన్న, ఉపేందర్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పోలీసు అవుతా.. గుడుంబాను నిర్మూలిస్తా..

మానుకోట ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో చిన్నారి



కొత్తగూడలో సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి భోజనం చేస్తున్న చిన్నారి

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 10 : చదువుకుని పోలీసును అవుతా.. గుడుంబాను నిర్మూలిస్తానని ఓ చిన్నారి ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో తెలిపింది. దీంతో.. నీ చదువుకు పోలీసులు సహకరిస్తారని ఎస్పీ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో శనివారం నిర్వహించిన గుడుంబా బాధితులకు చేయూత కార్యక్రమానికి గంగారం మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన ఓ వితంతువు తన చిన్నారితో హాజరుకాగా.. ఎస్పీ ఆ చిన్నారితో మాట్లాడారు. పెద్దయ్యాక ఎం అవుతావని ప్రశ్నించారు. చిన్నతనంలో గుడుంబాకు బానిసై నాన్న చనిపోయాడని ఆర్థికభారంతో చదువుకోలేక పోతున్నానని, లేకుంటే చదువుకుని పోలీస్ అయ్యేదాన్ని అని ఆచిన్నారి బదులిచ్చింది. స్పందించిన ఎస్పీనువ్వు చదువుకునేందుకు పోలీసులు సహకరిస్తారని భరోసా ఇచ్చారు. తన పక్కనే కూర్చొబెట్టుకుని భోజనం చేశారు. గుడుంబాతో నాలాంటి పిల్లల చదువు దూరమై భిక్షాటన చేస్తున్నారని ఎస్పీతో చెబుతూ విలపించింది,

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్



మాట్లాడుతున్న కోటూరి మానవతారాయ్

కేయూ క్యాంపస్, ఆగస్టు 10: రాష్ట్రంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏజెన్సీ సంస్థల దోపిడీ నుంచి రక్షించి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కోటూరి మానవతారాయ్ అన్నారు. శనివారం కేయూ క్యాంపస్‌లోని స్కాలర్స్ హాస్టల్ వద్ద నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మానవతారాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో లక్ష 45 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరంతా అవుట్ సోర్సింగ్ సంస్థల చేతుల్లో మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ తక్కువ జీతాలు చెల్లిస్తూ సకాలంలో ఇవ్వడం లేదన్నారు. అవుట్ సోర్సింగ్ సంస్థలను తక్షణమే రద్దు చేసి చట్టబద్ధమైన సంస్థను ఏర్పాటు చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన స్వర్ణయుగంలా ఉందన్నారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి రెండు లక్షల కొలువులను భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రూణమాఫీతో అందరూ స్వర్ణయుగం రేవంత్‌రెడ్డి పాలనను భావిస్తున్నారని అన్నారు. జీవో 29 మాజీ సీఎం కేసీఆర్ తెచ్చి ఇప్పుడు మెడికల్ సీట్ల విషయంలో టీఆర్ఎస్ డ్రామాలు చేస్తోందని దుయ్యబట్టారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో యువతకు లాభం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ సురాసి కృష్ణ, కేయూ పరిశోధక విద్యార్థులు తాళ్లపల్లి నరేశ్‌గౌడ్, గుండేటి సుమన్, వర్సిటీ నిరుద్యోగ జేఏసీ ఇన్‌చార్జి అభిరామ రమేశ్, పల్లె శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా ఇండిపెండెంట్ డే స్పెషల్ రైలు

కాజీపేట, ఆగస్టు 10: ఇండిపెండెంట్ డేను పురస్కరించుకుని కాజీపేట మీదుగా(07069/07070) హైదరాబాద్ - సంత్రగాచి - హైదరాబాద్ స్పెషల్ రైలు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు ఈనెల 14, 15 తేదీల్లో నడిపించనున్నారు. ఈనెల 14, 15వ తేదీల్లో హైదరాబాద్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి కాజీపేటకు 7.30 గంటలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్, జనగాం, కాజీపేట జంక్షన్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, పలాస, బుర్హంపూర్, ఖుర్దా, భువనేశ్వర్, కటక్, జైపూర్, కీయోంజార్, భద్రక్, బలసోర్, కరఖ్‌పూర్ స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

25న జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 10: రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న హనుకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్న ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-9, 19 బాలబాలికల విభాగంలో వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ క్రీడాకారులను సెప్టెంబర్ మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స'జీవ' శిల్పం!

● కాకతీయుల నాటి కళాసంపదకు పునరుజ్జీవం ● దెబ్బతిన్న శిల్పాల ఆకృతితో సిమెంట్ విగ్రహాల తయారీ ● కాకతీయుల శిల్ప సౌందర్యాన్ని కాపాడే ప్రయత్నంలో చరిత్ర పరిశోధకులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయుల కాలంలో నిర్మించిన ప్రతీ కట్టడం ఓ అద్భుతమే. అందులో ప్రతీ దేవాలయాల నిర్మాణానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకతే శిల్పం. ఎన్నో ఏళ్లు శ్రమించి శిల్పులు శిలలకు జీవం పోసేలా నిర్మాణం చేశారు. అందులో రామప్ప శిల్ప సౌందర్యం యునెస్కోను కట్టి పడేసింది. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి రామప్పను ప్రపంచ వారసత్వ కట్టడంగా యునెస్కో గుర్తించింది. కేవలం రామప్పలోని శిల్ప నైపుణ్యతతో పాటు నీటిలో తేలియాడే ఇటుకల తయారీ యునెస్కోను ఘైమరిపింపజేసింది. ఆలయం చుట్టూ గోడలపై ఉన్న నాట్యకారిణులు, ఏనుగులు, మదనికల విగ్రహాలు రామప్ప ప్రత్యేకత. నల్ల గ్రానైట్ రాయిపై చెక్కిన నాగిని, మద్నిక శిల్పాలు, రంగమండప స్తంభాలు, యాలి, గజకేసరి శిల్పాలు అలనాటి కళకారుల నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచి యునెస్కో గుర్తింపునకు దోహదపడ్డాయి. కాకతీయుల కాలంలో అనేక దేవాలయాల్లో ఇలాంటి శిల్ప సౌందర్యమే భక్తులను ఆకట్టుకుంటుంది. రామప్పతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యి స్తంభాల దేవాలయం, వరంగల్ కోట, గణపశ్వేరాలయం.. ఇలా అనేక ప్రాంతాల్లో కాకతీయుల కట్టడాలున్నాయి. వీటిలో చాలా వరకు ప్రకృతి వైపరిత్యాలతో పాటు హిందూ దేవాలయాలపై జరిగిన దాడుల్లో అనేక శిల్పాలు దెబ్బతిన్నాయి. కొన్ని శిల్పాలు వాటి అకృతిని పూర్తిగా కోల్పోయాయి. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని కాపాడేందుకు చరిత్ర పరిశోధకులు టీమ్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ అండ్ హెరిటేజ్ (టార్చ్) అనే పేరుతో అంతరించిపోతున్న చరిత్రకు జీవం పోసేందుకు కృషి చేస్తున్నారు.

శిల్పాలకు పునరుజ్జీవం..

కాకతీయుల కాలంలో కళావైభవం ఎంత వర్ధిల్లిందో.. శిల్ప సౌందర్యం కూడా అంతే ఆకర్షించింది. అయితే కాకతీయులు నిర్మించిన అనేక ఆలయాల్లోని శిల్పాలు దుండగుల దండయాత్రలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా వాటి అసలు రూపాన్ని కోల్పోయాయి. చరిత్రకు మౌనసాక్ష్యాలుగా నిలిచాయి. టార్చ్ ఆధ్వర్యంలో కాకతీయ రాజులు పరిపాలించిప్పుడు రూపొందించిన వందకు పైగా ప్రసిద్ధ శిల్పాలను గుర్తించి వాటికి మునుపటి రూపాన్ని తీసుకొచ్చేందుకు గత ఆరు నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కాకతీయ సామ్రాజ్యంలో దాదాపు 1,600 ప్రదేశాలలో అనేక దేవాలయాలు ఉన్నాయి. ఈవారసత్వ కట్టడాల్లో 4,000కుపైగా శిల్పాలున్నాయి. ఈ ప్రాజెక్టులో అరవింద్, ఈమని శివనాగిరెడ్డి (రిటైర్డ్ ఆర్కియాలజిసిస్ట్), ఏలూరి శేషబ్రహ్మం (ప్రముఖ కళాకారుడు), రఘువీర్ (స్తపతి), రక్షిత్(కళాకారుడు), హిమాన్ని(నృత్యకారిణి) దాదాపు 100పాడైపోయిన శిల్పాలను సేకకరించి స్కెచింగ్ చేసి శిల్పాలను తయారు చేయడం ప్రారంభించింది. వరంగల్ కోట, రామప్ప దేవాలయం, చంద్రవల్లి దేవాలయాలు, నాగులపాడు, కూసుమంచి, ధంతేశ్వరి నుంచి అనేక విగ్రహాల నమునాలను సేకరించారు. పునరుజ్జీవ ప్రాజెక్టు కాకతీయ రాజవంశం కాలం నాటి దెబ్బతిన్న శిల్పాలను పునర్మించడం లక్ష్యంగా పెట్టుకుంది. శిల్పాలు దెబ్బతినకుండా ఉంటే ఎలా ఉంటుందో ఊహించాల్సి ఉంటుంది. ఆ కళాఖండాలను గీసి.. సిమెంట్‌లో చెక్కాల్సి ఉంటుంది. ఇలా ఇప్పటివరకు 30శిల్పాలను పూర్తి చేశారు. కాకతీయుల కాలంలో ఒక్కో శిల్పం చెక్కడానికి కనీసం ఆరు నెలల సమయం పట్టేది. కాకతీయ శిల్పాలు తమ జీవితాంతం వేలాది శిల్పాలను రూపొందించారు. కాకతీయ కట్టడాలపై జరిగిన దాడులలో ఇటువంటి అద్భుతమైన కళాఖండాలు నాశనమయ్యాయి. శిథిలావస్థకు చేరిన శిల్పాల అసలు స్వరూపంపై ఇప్పటివరకు ఎలాంటి పరిశోధనలు జరగలేదు. వీటిని ఇలా నిర్లక్ష్యం చేస్తే ఉన్నవి కూడా కనుమరుగవుతాయని చరిత్ర పరిశోధకుడు అరవింద్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

శిల్పవైభవం భవిష్యత్తు తరాలకు తెలిసేలా

చరిత్రను గుర్తు పెట్టుకోవడానికి శాసనాలు, నాణేలు, పుస్తకాలు, జానపద కథలు లాంటి రాతపూర్వక ఆధారాలు ఉంటాయి. శిల్పాల ద్వారా చరిత్రను చూపించవచ్చుని, దెబ్బతిన్న శిల్పాలు అప్పట్లో ఎలా ఉండేవో.. వాటి అసలు అకృతిని ప్రజలకు చూపించాలని లక్ష్యంగా శిల్ప పునరుజ్జీవం కోసం చరిత్ర పరిశోధకులు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో కాకతీయులతో పాటు అనేక మంది రాజులు నిర్మించిన కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి అనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో ఓరుగల్లు శిల్పావైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించేలా పునరుజ్జీవ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. ప్రధానంగా రామప్ప, వరంగల్ కోటలోని అనేక శిల్పాలను గుర్తించారు. వీటి అసలు అకృతి ఉట్టిపడేలా సిమెంట్‌తో విగ్రహాలను తయారు చేస్తారు.






ఈ శిల్పాలకే పునరుజ్జీవం..

కాకతీయుల కాలంలో నిర్మించిన విగ్రహాలు అనేకం ధ్వంసమయ్యాయి. వీటిలో కొన్నింటి అసలు అకృతితో పునరుజ్జీవం కల్పించేందుకు టార్చ్ బృందం ఎంపిక చేసింది. వీటిలో రామప్ప ఆలయంలో వందలాది నృత్య శిల్పాలు న్నాయి. పేరిణి, కోలాటంతో పాటు ఇతర శిల్పాలు, నాలుగు కాళ్లతో శివప్రియ నృత్య భంగిమ ఉంది. రంగమండపానికి ఆగ్నేయం వైపు చెక్కిన ఈ శిల్పంలో ముగ్గురు మహిళలు నాలుగు కాళ్లతో నాట్యం చేస్తున్నారు. ఈ శిల్పానికి పునరుజ్జీవం కల్పిస్తున్నారు. అలాగే రామప్ప ఆలయంలోని రంగ మంటపంపైన ఉన్న కపాలి రాతిపై మధ్యలో నటరాజ, అష్ట దిక్పాలకులతో కూడిన కళాకృతి ఉంది. దీన్ని కూడా పునరుజ్జీవం కల్పించనున్నారు. వరంగల్ కోటలోని శంభు దేవాలయంలో అరుదైన ముఖలింగంతో ఉంది. నాలుగు దిక్కులకు నాలుగు ముఖాలు చెక్కి ఉంటుంది. వారిని నద్యోజాత, వామదేవ, అఘోర, ఈశాన అని పిలుస్తారు. ఈ లింగాన్ని కూడా నమునా తయారు చేస్తున్నారు. పాలంపేటలోని రామప్ప చెరువు కట్టపై ఉన్న త్రికూట ఆలయ ధ్వజస్థంభం కాల క్రమేణా అరిగిపోయింది. దీనికి కూడా పునరుజ్జీవం తేనున్నారు. వీటితో పాటు 100 శిల్పాలకు జీవం పోయనున్నారు.



శిల్పాలను తయారుచేస్తున్న స్తపతి రఘువీర్



కాకతీయ శిల్ప వైభవాన్ని కాపాడేందుకే..

అరవింద్, టార్చ్, ప్రధాన కార్యదర్శి

కాకతీయుల కాలంలో నిర్మించిన శిల్పాలను పునఃనిర్మించటంతో పాటు సాంస్కృతిక వైభవం, వారసత్వం, కళలను కాపాడేందుకు శిల్పాల పునరుజ్జీవ ప్రక్రియను చేపట్టాం. వారసత్వ కట్టడాల్లో దెబ్బతిన్న 100 శిల్పాలను గుర్తించాం. వీటిలో 30కి పైగా శిల్పాలను పునరుద్ధరించాం. వరంగల్, హైదరాబాద్ నగరాల్లో ఈ శిల్పాలను ప్రదర్శనకు ఉంచుతాం. ఛత్తీస్‌గఢ్, జగదల్‌పూర్‌లోని కాకతీయుల వారసుడు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ రాజ్‌మహల్‌లో ప్రదర్శించనున్నాం. ఈ మహల్‌ను త్వరలోనే మ్యూజియంగా మార్చి భవిషత్ తరాలకు కాకతీయుల శిల్ప వైభవం, చరిత్రను అందేలా చూస్తున్నాం.





యథావిధిగా నడుస్తున్న రైళ్లు

శాతవాహన, గోల్కొండ, కృష్ణా, పుష్‌పుల్‌తో సహా అన్ని రన్నింగ్

ఈ నెల 5 నుంచి పోయిన రైళ్ల పునరుద్ధరణ

గిర్మాజీపేట, ఆగస్టు 10: విజయవాడ రైల్వేస్టేషన్- విజయవాడ పశ్చిమ క్యాబిన్ మధ్య కొనసాగుతున్న మూడోలైన్ పనుల కారణంగా ఈనెల 5 నుంచి నిలిచిపోయిన శాతవాహన, గోల్కొండ, కాజీపేట- డోర్నకల్- విజయవాడ పుష్‌పుల్ రైళ్లతో సహా వరంగల్ రాకుండా దారి మళ్లించిన పలు రైళ్లు శనివారం నుంచి యథావిధిగా నడుస్తున్నాయి. సికింద్రాబాద్- విజయవాడ -సికింద్రాబాద్ శాతవాహన ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్- గుంటూరు -సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ - గుంటూరు- సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు, కాజీపేట- డోర్నకల్- విజయవాడ, విజయవాడ- డోర్నకల్ - కాజీపేట పుష్‌పుల్ రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగుతున్నాయి. వరంగల్ రాకుండా దారిమళ్లించిన ఆదిలాబాద్ -తిరుపతి -ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-తిరుపతి - సికింద్రాబాద్ పద్మావతి, హైదరాబాద్ -చెన్నై సెంట్రల్- హైదరాబాద్ చార్మినార్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ -గూడూరు -సికింద్రాబాద్ సింహపురి ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లన్నీ శనివారం నుంచి వరంగల్ మీదుగా రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం తిరుపతి నుంచి ఆదిలాబాద్ బయలుదేరిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ విజయవాడ, ఖమ్మం మీదుగా సాయంత్రం 6.10గంటలకు వరంగల్‌కు చేరుకుని ఆదిలాబాద్‌కు బయలుదేరింది. దీంతో 5 రోజుల పాటు విజయవాడ, హైదరాబాద్ వైపు రైళ్ల రాకపోకలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులకు ఊరట లభించింది.

సంగెం పీహెచ్‌సీలో అయోమయానికి తెర

ఒకరిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 10: వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఒకే పోస్టులో ఇద్దరిని కేటాయిస్తూ వెలువడిన ఉత్తర్వులను రద్దు చేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో అయోమయం అనే కథనం ఈ నెల 8న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. వరంగల్ జిల్లా సంగెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్‌గా ఎం.హనుమనాయక్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు ఉత్తర్వులు విడుదల చేశారు. మరో పది రోజులకు ఇదే స్థానంలో సదానందంను నియమిస్తున్నట్లు ఆదేశాలు వెలువడ్డాయి. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురాగా సదానందంను గీసుగొండకు బదిలీ చేసినట్లు తాజా ఉత్తర్వులు విడుదల చేశారు.

విలీనమైన రెండు విప్లవ కార్మిక సంఘాలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 10 : సంఘటిత, అసంఘటిత రంగాల్లో చురుగ్గా పనిచేస్తున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ), ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రెండు విప్లవ కార్మిక సంఘాలు ఒక్కటి కావడం చారిత్రాత్మక కార్మిక వర్గ పోరాటాలకు దిక్సూచిలా మారబోతుందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి,బిల్లకంటి సూర్యం అన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ భారత కార్మిక వర్గాన్ని దోచుకోవడానికి నూతన లేబర్ కోడ్‌లను జూలై 1వ తేదీ నుంచి అమలు చేస్తుందని వీటికి వ్యతిరేకంగా విశాల ఐక్య కార్మిక ఉద్యమాన్ని నిర్మించేందుకు ఢిల్లీలో ఈనెల 9న జరిగిన చర్చల్లో ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వన మాల కృష్ణ, కె.సూర్యం, టీయూసీఐ ఆలిండియా అధ్యక్షులు అమ్రేష్‌పటేల్, ఉపాధ్యక్షుడు ఉమాకాంత్ తీసుకున్న నిర్ణయం హర్షనీయమన్నారు. రెండు సంఘాలు ఐక్యమై దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల కార్మికుల ఐక్యత కోసం ప్రయత్నం చేస్తూ నిరంతర పోరాటాలకు దోహదపడుతుందని రవి, సూర్యం అన్నారు.

తొర్రూరులో కొనసాగుతున్న ఇన్‌చార్జ్ పాలన

- బదిలీపై వెళ్లిన అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తొర్రూరు రూరల్, ఆగస్టు 10 : ప్రభుత్వం ఇటీవల ఉద్యోగుల బదిలీలను చేపట్టింది. దీంతో తొర్రూరులో పంచాయతీరాజ్, పోలీసు, వ్యవసాయశాఖ, ఉద్యానవన, విద్యాశాఖల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు బదిలీపై వెళ్లారు. ఎంపీడీవో సిలార్ సాహెబ్ జూలైలో ఖమ్మంకు బదిలీపై వెళ్లగా, పెద్దవంగర ఎంపీడీవోకు ఎఫ్ఏసీగా బాధ్యతలను అప్పగించారు. ఈనెల 5వ తేదీ నుంచి 'స్వచ్ఛత-పచ్చదనం' కార్యక్రమం చేపట్టడంతో ఎక్కడ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్న పరిస్థితి లేదు. దీంతో కార్యాలయానికి వచ్చే ఆయా గ్రామాల పెన్షన్‌దారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీరాజ్ ఏఈలు యుగేందర్ ఆత్మకూరు మండలానికి, సురేష్ హన్మకొండకు బదిలీపై వెళ్లగా, గ్రామాల్లో వర్షాలకు ధ్వంసమైన రహదారుల మరమ్మతులు పట్టించుకునే వారు లేరు. గ్రామాల్లో కార్యదర్శులు అప్పులు


ఖాళీగా దర్శనమిస్తున్న తొర్రూరు ఎంపీడీవో ఛాంబర్

తెచ్చి చేసిన పనులకు బిల్లు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారి కుమార్ యాదవ్ సస్పెండ్ కాగా, ఉద్యానవనశాఖ అధికారి రాకేష్ హన్మకొండకు బదిలీపై వెళ్లగా, మహబూబాబాద్ హెచ్‌వో ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టారు. 8 మండలాలకు ఇన్‌చార్జ్‌గా ఉన్న హెచ్‌వో రాకేష్ బదిలీపై వెళ్లాడు. ఆయా మండలాల్లో పంటలు సాగుచేసే సమయంలో సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అధికారి అందుబాటులో లేకపోవడంతో, పెస్టిసైడ్ షాపు నిర్వాహకులు రైతులకు ఇష్టం వచ్చిన రీతిలో మందులను అంటకడుతున్నారు. శాంతి భద్రతలకు రక్షణగా ఉండే తొర్రూరు పోలీసుశాఖలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై జగదీష్, సీఐ సంజీవ్ వారం రోజుల క్రితం ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో అదనపు ఎస్సైగా ఉన్న రాంజీనాయక్ ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ప్రధానంగా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పంచాయతీరాజ్, పోలీసుశాఖ, ఉద్యానవనశాఖ అధికారులు ఇన్‌చార్జ్‌లు కావడంతో ప్రజలు కార్యాలయాల చుట్టు తిరిగి పోతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఇన్‌చార్జ్ అధికారుల పాలన సాగుతుంటే మండలస్థాయి అధికారులు సైతం అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రధానమైన శాఖల పోస్టుల భర్తీ కోసం పెద్దఎత్తున్న పైరవీలు కొనసాగుతుండడంతోనే భర్తీ ఆలస్యం అవుతోందని ప్రజలు బహటంగానే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తిస్థాయి అధికారులను నియమించాలని కోరుతున్నారు.

గీత కార్మికుడు ఆత్మహత్య


కృష్ణమూర్తి (ఫైల్)

నర్సింహులపేట, ఆగస్టు 10 : ఆర్థిక ఇబ్బందులతో కల్లుగీత కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కౌసల్యదేవిపల్లిలో జరిగింది. స్థానికులు, ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. గండి కృష్ణమూర్తి (70)కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఆర్థికంగా చితికినట్లు తెలిపారు. శనివారం ఉదయం కౌసల్యదేవిపల్లి పరిధిలోని రూప్లాతండాకువరినాటు వేసేందుకు కూలీలను పిలుస్తానని ఇంటినుంచి వెళ్లి, గ్రామం శివారు వైకుంఠదామం సమీపంలో మర్రిచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. మృతుడికి భార్య సుగుణమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు కమలాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కోన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

- ఇనుగుర్తి : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరివేసుకుని ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కోక్యతండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజ్ తెలిపిన వివ రాల ప్రకారం. తండాకు చెందిన జాటోతు రమేష్ (36) తనకున్న వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపానికి గురైన రమేష్ ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వార్డుల్లోని సమస్యలు పరిష్కరించాలి : సీపీఐ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 10 : మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, నాయకులు మాలోతు రవీందర్, తోట రాజకుమారి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో సీపీఐ వార్డుబాట-మాట కార్యక్రమం భాగంగా శనివారం 18, 25, 09 వార్డుల్లో పర్యటించారు. సదరు కాలనీల్లో బురదమయంగా ఉన్న రోడ్లపై నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంతర్గత రోడ్లు


మహబూబాబాద్‌లో బురదమయంగాఉన్న రోడ్డుపై నాటు వేసి, నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంద శంకర్, తండా శ్రీనాథ్, తరుణ్, రాకేష్, సాయి, అభిలాష్, బాలు, వాలి, ప్రమీల, వర్షిత్, హలీమా, మాధవి తదితరులు పాల్గొన్నారు.

'శివశంకర్ కృషితోనే ఓబీసీలకు రిజర్వేషన్లు'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 10 : జస్టిస్ శివశంకర్ కృషితోనే ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు జరిగాయని మున్నూరుకాపు ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జన్నారెడ్డి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం సంఘం ఆధ్వర్యంలో జస్టిస్ శివశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటుపడ్డారని కొనియాడారు. ఆయన చొరవతోనే ఓబీసీలకు రిజర్వేషన్ ఫలాలు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పడాల శ్రీనివాస్, ఆవుల కుమార్ పటేల్, పిట్టల చంద్రశేఖర్, రామరాజు ప్రవీణ్, చాపల వెంకన్న పాల్గొన్నారు.

- కేసముద్రం : కేంద్ర మాజీన్యాయశాఖ మంత్రి, మాజీ గవర్నర్, ఇందిగాంధీ రాజకీయ సలహదారు పుంజాల శివశంకర్ కృషితోనే బీసీల వర్గీకరణ అమలైందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చందా గోపి అన్నారు. అమినాపురం ఎంకే కన్వెన్షన్‌హాల్‌లోశివశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంకే సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి కముటం స్వామి, సింగంశెట్టి ఏకాం తం, రావుల మురళి, దామెరకొండ ప్రవీణ్‌కుమార్, ముత్యాల శివకుమార్, లక్కాకుల సత్యనారాయణ, కుమారస్వామి, బనిశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.


శివశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న మున్నూరుకాపు ఉద్యోగులు

ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ప్రభుకిరణ్



కేసముద్రం, ఆగస్టు 10 : కేసముద్రం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా పీటీసీ యజమాని వోలం ప్రభుకిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గణపతి ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఛాంబర్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ ప్రధాన కార్యదర్శిగా బోనగిరి ఉపేందర్, కోశాధికారిగా కొల్లూరు రమేష్, ఉపాధ్యక్షుడిగా శ్రీరాంకిరణ్, సహాయ కార్యదర్శిగా కట్కూరి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తాజా మాజీ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఓపెన్ టెన్త్ ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం

నెల్లికుదురు, ఆగస్టు 10 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ సీహెచ్ జీవన్‌కుమార్ తెలిపారు. నెల్లికుదురులో శనివారం ఆయన మాట్లాడుతూ పాఠశాల మధ్యలో మానేసినవారు, చదువుకోలేకపోయినవారు. ఈనెల 8నుంచి సెప్టెంబరు 10 వరకు టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అడ్మీషన్లు తీసుకోవాలని కోరారు. వివరాలకు మొబైల్ నెంబర్ 9908234819, 9701575227ను సంప్రదించాలన్నారు.

బాలునాయక్‌కు గౌరవ డాక్టరేట్

కేసముద్రం, ఆగస్టు 10 : కేసముద్రం స్టేషన్‌కు చెందిన భూక్య బాలునాయక్‌కు సామాజిక సేవా కార్యక్రమాల విభాగంలో పాండిచ్చేరిలోని ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ శనివారం గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. స్థానిక గిరిజనుడికి గౌరవ డాక్టరేట్ రావడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.


పాండిచ్చేరిలో డాక్టరేట్ పత్రాలను స్వీకరిస్తున్న బాలునాయక్

కల్వలలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కేసముద్రం, ఆగస్టు 10 : మండలంలోని కల్వలకు చెందిన కోనేటి వెంకన్న కుటుంబ కలహాలతో శుక్రవారం రాత్రి కత్తితో మెడ, చేయిపై కోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడు వెంకన్న శనివారం తెలిపిన ప్రకారం. వెంకన్నతో వారం క్రితం విభేదించి ఆయన భార్య పుట్టింటికి పిల్లలతో సహా వెళ్లింది. దీంతో తీవ్రమనోవేదనకు గురైన వెంకన్న ఇంట్లో ఉన్న కత్తితో మెడ, చేయిపై కోసుకున్నాడు. ఇరుగ ఫొరుగువారు గమనించి 108కు సమాచారం అందించగా అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కత్తి గాయాలు తీవ్రంగా లేకపోవడంతో తనకు ప్రాణాపాయం తప్పిందని బాధితుడు తెలిపారు.

ఫోర్జరీ సంతకాలతో రూ.19 లక్షలు డ్రా చేశారని ఆరోపణ

- విచారణ జరిపి నివేదికను దాచిపెడుతున్న అధికారులు

కేసముద్రం, ఆగస్టు 10 : కేసముద్రంలోని ఓ బ్యాంకులో తన సంతకాలను ఫోర్జరీ చేసి రూ.19లక్షలు డ్రా చేశారని స్థానికుడైన బ్రహ్మదేవర జయకృష్ణ ఆరోపించారు. కేసముద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ 2020 నుంచి 2022 మధ్యకాలంలో తన ఖాతా నుంచి పలుమార్లు విత్‌డ్రా ఓచర్లపై ఫోర్జరీ సంతకాలతో డబ్బులు డ్రా చేశారని తెలిపారు. అప్పట్లో ఈ విషయంపై సంబంధిత బ్యాంకు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయగా, విచారణ జరిపి ఎలాంటి చర్య తీసుకోలేదని తెలిపారు. ఏడాది కాలంగా తిరుగుతున్నప్పటికీ విచారణ నివేదికను వెల్లడించకుండా తనపైనే కేసు పెడుతామని అధికారులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. విచారణ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకొని తన డబ్బులు ఇప్పించాలనిఉన్నతాధికారులను కోరారు.

సేంద్రియ ఎరువులతోనే పంటలకు ఆరోగ్యం

ఇనుగుర్తి, ఆగస్టు 10 : సేంద్రియ ఎరువులతోనే పంటలు ఆరోగ్యంగా ఉండి అధిక బడి వస్తుందని జీవన ఆధార్ సొసైటీ డైరెక్టర్ సక్రుబాయి అన్నారు. ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారం, ఇనుగుర్తి గ్రామాల్లోని ఆయా పంటలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. జీవన ఆధార్ సొసైటీ ఆధ్వర్యంలో గతంలో ఎంపిక చేసిన రైతులకు చిరుధాన్యాలు, కూరగాయల విత్తనాలు అందజేశారు. వారు సాగు చేస్తున్న పంటలను పరిశీలించినట్లు చెప్పారు. పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు జైపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జీవన్ పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 10 : ప్రతీ ఒక్కరు అవయవదానం చేసేందుకు ముందుకు రావాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదరరాజనర్సింహ అన్నారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో అవయవదానంపై ముద్రించిన కరపత్రాన్ని తెలంగాణ రాష్ట్ర నేత్ర అవయవ శరీర దాతల సంఘం (టీఈఓబీడీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పరికిపండ్ల అశోక్ నేతృత్వంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవయవదానికి ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి దేశంలోనే అవయవదానంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషిచేస్తున్న సంస్థలను అభినందిస్తున్నట్లు తెలిపారు.


అవయవదానంపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దామోదరరాజనర్సింహ

దివ్యాంగులకు వీల్‌చైర్‌ల పంపిణీ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 10 : జిల్లా కేంద్రంలోని లెనిన్‌నగర్ 24వ వార్డు పరిధిలో దివ్యాంగులకు ఉచితంగా వీల్‌చైర్‌లను మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ లెనిన్‌నగర్ కవనెంట్ చర్చిఇండియా క్రిస్టియన్ మినిస్ట్రీస్(ఐసీఎం) జిల్లా అధ్యక్షులు సేవ్య సహకారంతో దివ్యాంగులకు ఉచితంగా వీల్‌చైర్‌లను అందించడం అభినందనీయమన్నారు. ప్రతీ ఒక్కరు సమాజసేవలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, గణేష్, మార్నేని కిరణ్, ఎలియా, అబ్రహ్మం, చర్చి ఫాదర్ పౌలు, మోషయ్య, స్థానికులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు వీల్‌చైర్‌లు పంపిణీ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

జిల్లాలో 100.8 మిల్లిమీటర్ల వర్షపాతం

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 10 : శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. దంతాలపల్లి, మరిపెడ, డోర్నకల్, నర్సింహులపేట మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. డోర్నకల్ 17.2, కురవిలో 4.2, మహబూబాబాద్‌లో 0.6, నెల్లికుదురులో 8.4, నర్సింహులపేటలో 14.4, చిన్నగూడూరులో 5.8, మరిపెడలో 17.2, దంతాలపల్లిలో 18.2, తొర్రూరులో 6.2, పెద్దవంగరలో 8.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. వెరసి 100.8 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు కాగా, జిల్లాలో సగటున 6.3 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది.

వేంకటేశ్వర స్వామికి వెండి వస్తువులు కానుక

గార్ల, ఆగస్టు 10 : మండలకేంద్రం సమీపంలోని గార్ల వేట వేంకటేశ్వర స్వామికి లక్ష రూపాయల విలువైన వెండి వస్తువులను స్థానిక పీఏసీఎస్‌చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ దంపతులు శనివారం ప్రత్యేక పూజలు జరిపి స్వామి వారికి బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధికి ప్రతీ ఒక్కరు తమవంతు సహాయ సహకారాలు అందించే విధంగా ముందుకు రావాలన్నారు. గాలి దుమారాలకు నేలకూలిన ధ్వజస్తంభం స్థానంలో మరో కొత్తది ఏర్పాటుకు ఆలయ కమిటీ చర్యలు చేపట్టాలన్నారు.

మాజీ మార్కెట్ చైర్మన్‌ను పరామర్శించిన రెడ్యా

డోర్నకల్, ఆగస్టు 10 : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్‌ను మాజీఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ శనివారం పరామర్శించారు. విద్యాసాగర్ మాతృమూర్తి నాగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నాగమ్మ మృతివార్త తెలుసుకున్న రెడ్యానాయక్ విద్యాసాగర్ కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు కొత్త వీరన్న, యశోదర్‌జైన్, కల్లెపు సతీష్‌గౌడ్, జర్పుల వీరన్న, పచ్చిపాల మల్లేశం ఉన్నారు.

కేరళ వరద బాధితుల కోసం సీపీఐ ఆర్థిక సాయం


హైదరాబాద్‌లో కేరళ వరద బాధితుల కోసం ఎమ్మెల్యే సాంబశివరావుకు నగదును అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 10 : కేరళ వరద బాధితుల కోసం మహబూబాబాద్ సీపీఐ పార్టీ సేకరించిన నగదును ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు శనివారం హైదరాబాద్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి అజయ్‌సారథి అందజేశారు. ఈ సందర్భంగా అజయ్‌సారథి మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణంతో పాటు గార్ల మండల కేంద్రంలో రెండురోజుల పాటు విరాళాల రూపంలో సేకరించిన నగదును వరద బాధితుల సహాయార్థం అందజేసినట్లు తెలిపారు. వరద బాధితుల కోసం అన్నివర్గాల ప్రజలు, వ్యాపారస్థులు, ఉద్యోగస్తులు అందరూ తమవంతు సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసముద్రంలో..

- కేసముద్రం : కేరళ వయనాడ్‌లో బాధితులకు సహాయం అందించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో కేసముద్రంలో శనివారం విరాళాలను సేకరించారు. వీధుల్లో తిరిగి దుకాణాదారుల నుంచి రూ.10వేల విరాళాలు సేకరించగా పార్టీ జిల్లా కమిటీకి పంపించినట్లు మండల కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా కమిటీ సభ్యుడు మార్తినేని పాపారావు, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, అల్సుగొండసావిత్ర, కావటి నర్సయ్య, జల్లె జయరాజు, కదిరె రాజు పాల్గొన్నారు.

'బోధకాలు నివారణకు చర్యలు తీసుకోవాలి'

గార్ల, ఆగస్టు 10 : బోదకాలు నివారణకు ప్రతీ ఒక్కరు కృషిచేస్తూ.. వ్యాధి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. శనివారం ముల్కనూరు పీహెచ్‌సీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బోదకాలు నివారణ అవగాహన శిబిరం ఏర్పాటు చేసి, ముదు జాగ్రత్తగా ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధకాలు వ్యాధిని నివారణకు రెండేళ్ల వయసు దాటినవారంతా డీఈసీ ఆల్బెండజోల్ మందులను తీసుకోవాలని, విటిని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందజేయడం జరుగుతుందని, వీటిని అందరు తప్పక తీసుకోవాలన్నారు. ఈ వ్యాధి మొదట జ్వరం, బిల్లలు కట్టడం, తదితర లక్షణాలల్లో మొదలై తరువాత బోదకాలుగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మురళీధర్, డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, ప్రోగ్రామ్ అఫీసర్, డాక్టర్ సుధీర్, డీఏవో లక్ష్మీనారాయణ, డీఎల్పీవో కనకదుర్గ, ఎంపీడీవో మంగమ్మ, సిబ్బంది రామకృష్ణ, శ్రీహరి, ఇస్మాయిల్, కిషన్, ఆశాలు, అంగన్వాడీలు రాజకీయ పక్షనాయకులు విమల్‌కుమార్ జైన్ గుండెబోయిన నాగమణి, గుండా వెంకట్‌రెడ్డి, కందునూరి శ్రీనివాస్, శివనాయక్, పాల్గొన్నారు.


శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు

అమ్మ బైలెల్లినాదో.. తల్లి బైలెల్లినాదో..

(5వ పేజీ తరువాయి)

కాంతులు వెదజల్లేలా లైట్లు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ పూజారులు, కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

- మరిపెడ : మరిపెడబంగ్లా, మరిపెడ విలేజీలో ఆదివారం బోనాల పండుగను నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ వెంకటస్వామి తెలిపారు. కమిషనర్ మాట్లాడతూ ముత్యాలమ్మ ఆలయాల దగ్గర ఇప్పటికే పండుగ ఏర్పాటు పూర్తి చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రత ఏర్పాటు చేస్తున్నారు. కమిషనర్ వెంట పానుగోత్ వెంకన్న, రేఖ వెంకటేశ్వర్లు ఉన్నారు.

పోలీస్‌శాఖ ప్రజలకు అండగా ఉంటుంది

(5వ పేజీ తరువాయి)

పేర్కొన్నారు. జిల్లాలో గుడుంబాను నిర్మూలించేందుకు పోలీస్ యంత్రాంగం అహర్నిశలు పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, గూడూరు సీఐ బాబురావు, బయ్యారం సీఐ రవి, కొత్తగూడ, గంగారం, గూడూరు ఎస్సైలు కుశకుమార్, రవికుమార్, గిరిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

గ్రామీణ యువత క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సూచించారు. కొత్తగూడలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన క్రీడలను ప్రారంభించారు. యువకులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో త్వరలో జాబ్‌మేళా నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు సైబర్‌క్రైమ్, షీటీమ్, నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

యువతలోని క్రీడాస్ఫూర్తిని వెలికితీయాలి


గూడూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్

గూడూరు : గ్రామీణ ప్రాంతాల యువతలో ఉన్న క్రీడాస్ఫూర్తిని వెలికితీయాలని ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అన్నారు. గూడూరు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వాలీబాల్ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. మహబూబాబాద్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత గంజాయి, మత్తు పదార్థాలాంటి వాటి బారిన పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. డీఎస్పీ తిరుపతిరావు, సీఐ బాబురావు, ఎస్సై గిరిధర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

నెల్లికుదురు, ఆగస్టు10 : హనుమాన్‌గర్ తండాలోని రైస్‌మిల్లుకు తరలిస్తున్న 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం రాత్రి పోలీస్‌లు పట్టుకున్నారు. ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం. నెల్లికుదురు మండల కేంద్రానికి చెందిన ఆకుల అజయ్, తుంపిల్ల ఉపేందర్ కలిసి గ్రామాలలో పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి మనుమాన్‌నగర్ తండా దళపతి ఏసువర్మ రైస్ మిల్లుకు తరలిస్తున్నక్రమంలో పట్టుకొని సీజ్‌చేసి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తొర్రూరులో దొంగల హల్‌చల్

తొర్రూరు, ఆగస్టు 10 : డివిజన్ కేంద్రంలో శనివారం తెల్లవారుజామున దొంగలు హల్‌చల్ చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. బస్టాండు ఎదురుగాఉన్న కాంప్లెక్స్‌లోని రెండు దుకాణాలలో చోరీ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దొంగలు షటర్ల తాళాలు పగులగొట్టి దొంగతనం చేశారని బాధితులు వాపోయారు. భవాని జనరల్ స్టోర్స్‌లో సిగిరెట్లు, ఇతర సామగ్రిని, మరొక బట్టల షాపులో బట్టలను దొంగలించినట్టు బాధితులు గుర్తించారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ సురేష్ సందర్శించి క్లూస్ టీంతో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.2లక్షల చోరీ జరిగిందని, దుకాణాదారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్సై రాంజీనాయక్ తెలిపారు.

జాతీయ రహదారిపై వాహన తనిఖీలు

కురవి, ఆగస్టు 10 : కురవిలోని ఎన్‌హెచ్-365 జాతీయ రహదారిపై మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. సుమారు గంటన్నరపాటు అనుమానస్పదంగా ఉన్న అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గోపి, ఏఎస్సై వెంకన్న పాల్గొన్నారు.

'సభను జయప్రదం చేయండి'

తొర్రూరు, ఆగస్టు 10 : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టు తీర్పు అనుకూలంగా ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే సభను జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమారపు ఐలయ్య, మహంకాళి బుచ్చయ్య అన్నారు. శనివారం డివిజన్‌కేంద్రంలో జరిగిన సమావేశంలో వారుమాట్లాడుతూ ఆగస్టు 13వ తేదిన హైదరాబాద్‌లో నిర్వహించే విజయోత్సవ సభ, ర్యాలీకి మాదిగ జాతి యావత్తు, మాదిగ ఉద్యోగ సంఘాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, యాకూబ్, భిక్షపతి ఉన్నారు.

కెపాసిటర్ల ఏర్పాటుతో రైతులకు మేలు

మరిపెడ, ఆగస్టు10 : విద్యుత్ మోటర్లకు రైతులు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎంతో జరుగుతుందని ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్ అన్నారు. శనివారం ఆయన మరిపెడ మునిసిపల్ కేంద్రంలో నిర్వహించిన పొలం బాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ సమస్యల పరిష్కారంపై రైతులతో మాట్లాడారు. కెపాసిటర్ల ఏర్పాటు వల్ల కరెంట్ హెచ్చుతగ్గులను కట్టడి చేయడం జరిగి మోటర్లు కాలిపోకుండా భద్రత ఉంటుందన్నారు. దాంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లపై వత్తిడి ఉండదన్నారు. ఏఈ పావని, వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్స్ ఉన్నారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకున్న గ్రామస్థులు

- పోలీసులకు అప్పగింత

కేసముద్రం, ఆగస్టు 10 : కేసముద్రం స్టేషన్‌లో శనివారం ఒకరి ఇంటి ఆవరణలోకి ప్రవేశించి తాళం పగులగొడుతున్న వ్యక్తిని గ్రామస్తులు పట్టుకున్నారు. చేతిలో కొడవలితో పంజాబ్‌డ్రెస్ వేసుకున్న వ్యక్తి ఒక ఇంటి ఆవరణలో తాళం పగులగొడుతుండడంతో అదే ఆవరణలో మరో గదిలో అద్దెకుంటున్న మహిళచూసి ప్రశ్నించగా, చేతిలో కొడవలిని చూపుతూ డబ్బులు ఇవ్వాలని హిందీలో అడిగాడు. దీంతో ఆ మహిళ భయాందోళనతో కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు వచ్చి ఆ యువకున్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆ యువకుడు తనది నాందేడ్ అని చెబుతున్నాడు. చేతిలో కొడవలితో ఆడవారి దుస్తులు ధరించి, చోరీకి యత్నించిన యువకున్ని పట్టుకున్న విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.


అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకున్న కేసముద్రం గ్రామస్థులు

బీజేవైఎం జిల్లా కమిటీ నియామకం

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 10 : భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) మహబూబాబాద్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్ శనివారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా అల్లం సాయికుమార్, చెలుపూరి రాజు, బోడ రమేష్, ముద్దల అభిషేక్, ప్రధాన కార్యదర్శులుగా నార్ల రమేష్, కాగు నవీన్, నేలం నాగేంద్రబాబు, కార్యదర్శులుగా ముత్యం ఉమేష్, ఎర్రబోయిన కర్ణాకర్, కందుకూరి నరేష్, బాశెట్టి రాజు, కోశాధికారిగా కట్ల మునేందర్, అధికార ప్రతినిధులుగా గువ్వ శ్రీకాంత్, వేము నితిన్‌రెడ్డి, బాదావత్ రెడ్యా, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ముఖేష్, బాదావత్ లాల్‌సింగ్, కొలిశెట్టి ప్రవీణ్‌గౌడ్, కొయ్యల ముఖేష్‌గౌడ్, చెన్నబోయిన చింటు, జిల్లా ఆఫీస్ జాయింట్ కార్యదర్శిగా బానోతు సుధాకర్, జిల్లా ప్రోగ్రాం కన్వీనర్‌గా మెడద మధు, పబ్లిసిటీ కన్వీనర్‌గా బాదావత్ సంజయ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా బాదావత్ నవీన్‌ను నియమించినట్లు తెలిపారు.

ముత్యాలమ్మ బోనాలకు ఏర్పాట్లు పూర్తి

గూడూరు, ఆగస్టు 10 : గూడూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గూడూరు, చంద్రగూడెం, గొల్లగూడెం, వడ్డెరగూడెం శివారు గ్రామాల్లోఉన్నముత్యాలమ్మ తల్లి ఆలయాల్లో బోనాల సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు గూడూరు మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ తెలిపారు. ముత్యాలమ్మతల్లి ఆలయాలకు శనివారందగ్గరుండి రంగులను వేయించారు. వేడుకలరోజున రంగుల విద్యుత్ దీపాలు, డీజే సౌండ్‌సిస్టం ఏర్పాటు, డప్పుచప్పుళ్లు నిర్వహణ చేసే కులవృత్తుల వారికి మొత్తం సుమారు రూ.1.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని, ఆ ఖర్చును తానే పెట్టుకుంటానని స్పష్టం చేసినట్లు చెప్పారు.


గూడూరు ముత్యాలమ్మ ఆలయానికి రంగులు వేయిస్తున్న రమేష్‌నాయక్

వట్టివాగులో వలకు చిక్కిన వింతచేప

కేసముద్రం, ఆగస్టు 10 : మండలంలోని కాట్రపల్లి వద్ద నున్న వట్టివాగులో శనివారం వింత చేప వలకు చిక్కింది. భవానిగడ్డతండాకు చెందిన నూనావత్ కిషన్ ఉదయం వలతో వట్టివాగులో చేపలు పట్టగా అందులో నలుపు, తెలుపుచారలతో పెద్దరెక్కలతో వింత ఆకారంలోని చేప చిక్కింది. కాట్రపల్లి గ్రామంలోకి అసాధారణంగా ఉన్న చేపను తీసుకురాగా చుట్టుపక్కల ఉన్నవారు ఆసక్తిగా పరిశీలించారు.


భవానిగడ్డతండాలో వలకు చిక్కిన వింతచేప